

క్వారీ..ఆక్రమణల సవారీ!
పలమనేరు మండలం, కొలమాసనపల్లి పంచాయతీ మాదిగబండ వద్ద ఓ క్వారీని టీడీపీ నేత ఆక్రమించేశాడు. - 10లో



నిద్రపుచ్చి.. కౌన్సెలింగ్ కొచ్చి!
ఎస్జీటీల స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతి ప్రక్రియ అస్తవ్యస్తంగా మారింది. చంటి బిడ్డ తల్లులు అవస్థలు పడుతున్నారు. - 10లో



ఉజ్వల భవితకు ఐఐటీ
జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారితో శనివారం సమావేశం కానున్నట్టు తిరుపతి ఐఐటీ డైరెక్టర్ తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

అల్లాహ్ అందరికీ అండగా ఉండాలి



శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని ముస్లింలకు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, భక్తికి ప్రతీక అయిన ఈ పవిత్రమైన రోజున అల్లాహ్ మీ ప్రార్థనలను అంగీకరించాలన్నారు. కుటుంబ సభ్యులకు శాంతి, సంతోషం ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

సుఖసంతోషాలతో జరుపుకోవాలి

చిత్తూరు అర్బన్: బక్రీద్ పండుగను ముస్లింలు సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎస్పీ మణికంఠ చందోలు ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. బక్రీద్ పండుగ జిల్లాలో ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు జరిగితే స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయవచ్చుని ఆయన సూచించారు.

రాహుకాల అభిషేకాలు



చౌడేపల్లె: బోయకొండ గంగమ్మకు శుక్రవారం రాహుకాల అభిషేక పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేశారు. రాహుకాల సమయంలో సంప్రదాయరీతిలో అర్చనలు, అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు, ఉచిత అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

రేపు కాణిపాకంలో సామూహిక అక్షరాభ్యాసం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఆదివారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్టు ఈవో పెంచలకిషోర్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, అక్షరాభ్యాసానికి ఉచిత ప్రవేశమని తెలిపారు. చిన్న పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

డీఎస్సీ పరీక్షకు 103 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రంలో నిర్వహించిన మొదటి రోజు డీఎస్సీ పరీక్షకు 103 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. ఈ మేరకు శుక్రవారం చిత్తూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రంలోని 8 పరీక్ష కేంద్రాల్లో తొలిరోజు డీఎస్సీ పరీక్షలను నిర్వహించారు. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో పరీక్షలను జరిపారు. ఈ పరీక్షలకు 8 పరీక్ష కేంద్రాల్లో 859 మంది అభ్యర్థులకు గాను 756 మంది హాజరయ్యారు. డీఎస్సీ పరీక్షల నిర్వహణ తీరును పలువురు విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

నకిలీ యూట్యూబర్ హల్‌చల్



నకిలీ యూట్యూబర్

గంగవరం: పొలంలో చదును చేసుకుంటున్న రైతు వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి తాను న్యూస్ యూట్యూబర్ అంటూ బెదిరించాడు. తనకు లంచం ఇవ్వాలంటూ రైతుతో వాగ్వాదానికి దిగాడు. తీరా ఆ రైతు తిరబడడంతో అతను కొంతసేపు రోడ్డుపై హల్‌చల్ చేసి అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ ఘటన మండలంలో శుక్రవారం ఆలస్యంగా వెలుగు చూసింది. బాధిత రైతు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కీలపల్లి పంచాయతీ, బాలేపల్లి గ్రామానికి చెందిన రైతు బద్రినాథ్‌రెడ్డి గ్రామ సమీపంలోని హైవేలో ఉన్న సర్వే నం.407/1 లోని తన మూడెకరాల భూమిలో ముళ్ల పొదలను జేసీబీతో తొలగించి చదును చేసుకుంటున్నాడు. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన ఓ వ్యక్తి తాను యూట్యూబర్ అని, తనకు డబ్బు ఇవ్వకపోతే నీపై లేనిపోనివి యూట్యూబ్‌లో వేస్తానంటూ రైతును బెదిరించాడు. దీంతో ఇద్దరి మధ్య కొంతసేపు వాదనలు జరిగాయి. అంతలో ఆ రైతు తన మొబైల్ ద్వారా వీడియోలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యాయి. అంతవరకూ రోడ్డుపై హల్‌చల్ చేసిన నకిలీ యూట్యూబర్ అక్కడి నుంచి ఉడాయించాడు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,284 మంది స్వామి వారిని దర్శించుకోగా 31,268 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సర్వేలతో సరి!

కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా సర్వేలతో సరిపెట్టేస్తోంది. సవాలక్ష ప్రశ్నలతో ప్రజలను ముప్పుతిప్పలకు గురిచేస్తోంది. ఇదేమని అడిగితే సంక్షేమ పథకాలకంటూ అధికారులు బుకాయించడం రివాజుగా మారుతోంది. సేకరించిన వ్యక్తి సమాచారాన్ని ఏం చేస్తున్నారో.. ఎక్కడ భద్రపరుస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వం ఏడాదిలోనే 90 శాతం హామీలు అమలు చేయగా.. నేటి కూటమి ప్రభుత్వం ఒక్క సంక్షేమ పథకాన్నీ సక్రమంగా అమలు చేయక సర్వేలతో కాలయాపన చేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సర్వేలు.. వాటి వివరాలపై 'సాక్షి'గ్రౌండ్ రిపోర్ట్.

జిల్లా కేంద్రంలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది(ఫైల్)



- కూటమి ఏడాది పాలనలో సర్వేల మీద సర్వేలు
- ఎందుకని అడిగితే సంక్షేమ పథకాల కోసమంటూ సమాధానం
- సర్వేలు చేశారే తప్ప పథకాలు అమలు చేయని వైనం
- సేకరించిన వ్యక్తిగత సమాచారానికి గోప్యత ఉందా?

చిత్తూరు కలెక్టరేట్ : ఎన్నికల సమయంలో ప్రతి కుటుంబానికి లబ్ధి కలిగేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీలు గుప్పించింది. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అమలు చేయకుండా సర్వేలకు ప్రాధాన్యమిచ్చింది. ఈ సర్వేల వల్ల ప్రజలకేమైనా లాభం చేకూర్చారా..? అంటే అదీ లేకుండా పోయింది. సచివాలయ ఉద్యోగులను పలుమార్లు ఇంటింటికీ తిప్పి ప్రజల వ్యక్తిగత సమాచారాన్ని సేకరించారు. ఇది ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తే సంక్షేమ పథకాల అమలు కోసమని మాయమాటలు చెప్పించారు. జిల్లా వ్యాప్తంగా చిత్తూరు, కుప్పం, పుంగనూరు, పలమనేరు, నగరి, పూతలపట్టు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో సచివాలయ సిబ్బంది నెలల తరబడి ఇంటింటికీ తిరిగి ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరించారు.

దానికి గోప్యత ఉందా?

వివిధ రకాల సర్వేల పేరుతో కూటమి ప్రభుత్వం సేకరించిన ప్రజల వ్యక్తిగత వివరాలకు గోప్యత లేని దుస్థితి. 2019కు ముందు అప్పట్లో వివిధ సర్వేలు చేపట్టి ప్రజల సంక్షేమ పథకాలకు అప్పటి టీడీపీ లింక్ పెట్టిన విషయం విధితమే. ఇదేవిధంగా ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల్లో కోత విధించేందుకు వివిధ సర్వేలు చేపట్టిందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. కూటమి చేపట్టిన సర్వేల్లో సేకరించిన సమాచారాన్ని ప్రభుత్వ కార్యక్రమాలకే వాడుతున్నారా? ఇంకేమైనా కుట్రలు చేస్తున్నారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గత ఐదేళ్లలో ఎలాంటి సర్వేలు లేకుండానే..

గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి సర్వేలు నిర్వహించకుండానే సంక్షేమ పథకాలను అమలు చేసింది. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరేలా పరిపాలనను అందించింది. అర్హులైన అన్ని కులాల ప్రజలకు ఎలాంటి తారతమ్యం లేకుండా సంక్షేమ పథకాలను ఇంటి ముంగిటకే చేర్చింది. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నవరత్నాల హామీల మేనిఫెస్టో ప్రకారం అమలు చేసింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం గత ఏడాదిగా సర్వేల పేరుతో చేస్తున్న కుట్రలపై ప్రజలు విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

చిత్తూరు జిల్లా సమాచారం

మండలాలు 32	మొత్తం జనాభా 18.73 లక్షలు
పురుషులు 9.4 లక్షలు	మహిళలు 9.33 లక్షలు
రూరల్ జనాభా 15.04 లక్షలు	అర్బన్ జనాభా 3.69 లక్షలు
మొత్తం కుటుంబాలు 4.56 లక్షలు	రూరల్‌లోని కుటుంబాలు 3.66 లక్షలు
అర్బన్‌లోని కుటుంబాలు 0.9 లక్షలు	ఎస్సీ జనాభా 3.94 లక్షలు
ఎస్టీ జనాభా 0.52	

అమ్మో..పీ-4

కూటమి ప్రభుత్వం పీ4 పేరుతో సర్వే నిర్వహించింది. ఈ సర్వేపై జిల్లాలోని అన్ని వర్గాల్లో ఆందోళన వ్యక్తమైంది. సంక్షేమ పథకాల ఎత్తివేతకే ఈ సర్వే చేస్తున్నారన్న అనుమానం బలపడింది. ఇప్పటికే ఎన్నికల ముందు హామీలిచ్చి వంచనకు గురిచేసింది. ఇప్పుడు గుట్టుచప్పుడు కాకుండా జిల్లాలో పబ్లిక్-ప్రయివేట్-పీపుల్ పార్టిసిపేషన్ (పీపీపీ) పేరిట సర్వే చేపట్టింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు సంబంధించిన సమగ్ర వివరాలు సేకరించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేశారు. పారిశ్రామికవేత్తలు, ఎన్ఆర్ఐలు, దాతల సహకారంతో గుర్తించిన నిరుపేదల జీవన పరిస్థితులు మెరుగుపరచడమే సర్వే ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. అయితే ఈ సర్వేపై ఎన్నో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సేకరిస్తున్న వివరాల్లో ఎక్కువ భాగం ఆదాయానికి సంబంధించిన ప్రశ్నలే ఉండడం పలు సందేహాలకు తావిస్తోంది.

సర్వేలు ఇలా..

హౌస్‌హోల్డ్ సర్వే, మనమిత్ర క్యాంపెయిన్, నాన్ రెసిడెంట్, అదర్ డిపార్ట్‌మెంట్ ఈకేవైసీ సొసైటీ బ్యాంక్ ఓటర్ల పేరుతో సర్వే చేపట్టారు. ఇవే కాకుండా పలు రకాల సర్వేలు చేపట్టి ప్రజలను భయాందోళనలను గురిచేశారు.



కూటమి ప్రభుత్వంలో సర్వేల నిమిత్తం తయారు చేసిన ప్రత్యేక వివరాల యాప్ చిత్రం

కాలయాపనకే సర్వేలు



సర్వేల పేరిట ప్రతి ఇంటికీ వెళ్లి టీవీ ఉందా, ఫ్రిజ్ ఉందా, ఏసీ ఉందా, వాషింగ్‌మెషిన్ ఉందా, సైకిల్ ఉందా, కారుందా, ప్రభుత్వ ఉద్యోగమా? ప్రైవేటు ఉద్యోగమా? అంటూ సవాలక్ష ప్రశ్నలతో సర్వేలు చేస్తున్నారు. సచివాలయ ఉద్యోగులను వేధించడానికే ఈ సర్వేలు పెట్టారా అనిపిస్తోంది. సర్వేలు చేస్తున్నారు.. ఏదో జరిగిపోతుందని జనం ఆతృతతో ఎదురుచూస్తే ఇప్పటివరకు ఏమీ జరగలేదు. ఆ సర్వేలన్నీ ప్రభుత్వం ఏదో చేస్తుందని భ్రమలో పెట్టి కాలయాపన చేయడానికే.

– ప్రకాష్, ముడిపల్లి, నగరి మండలం

మాకు తెలియదంటున్నారు



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సవాలక్ష హామీలు గుప్పించింది. తీరా అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్నా ఒక్క పథకం అమలు చేయలేదు. పలు పథకాల కోసం మహిళలు నిరీక్షిస్తున్నారు. సర్వేలతో సచివాలయ సిబ్బంది కాలయాపన చేస్తున్నారు. పథకాలు ఇచ్చిందీ లేదు.. ఏమీ లేదు. వీటిపై సర్వే చేస్తున్న సిబ్బందిని ప్రశ్నిస్తే మాకు తెలియదంటున్నారు.

– సెల్వి, గృహిణి చిత్తూరు

ఒరిగిందేమీ లేదు



సచివాలయాలను నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం ఒడిగట్టింది. సచివాలయ సిబ్బందితో చేపట్టిన సర్వేల వల్ల ఒరిగిందేమీ లేదు. వారిని ఇబ్బంది పెట్టడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోంది. సర్వేల వల్ల ప్రజలకు ఎలాంటి ప్రయోజనం లేదు. ప్రజలకు సంబంధిన సమాచారాన్ని సేకరించడం ద్వారా ఎలాంటి ఇబ్బందులొస్తాయో ఎవరికీ తెలియడం లేదు. ఎప్పుడూ లేని విధంగా 17 సార్లు సర్వే చేశారు. దీనిపై పలు అనుమానాలు ఉన్నాయి.

– పద్మనాభశెట్టి, సురేంద్రనగరం, కార్వేటినగరం మండలం

సహకరించడం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ ఉద్యోగులకు పలు రకాల సర్వేలను అప్పగించారు. అయితే ఇళ్ల వద్దకెళ్లి ఆధార్ ఆథెంటికేషన్ కోసం ఓటీపీ చెప్పమంటే జనం చెప్పడం లేదు. ఎందుకు మా బ్యాంకుల్లో డబ్బును కొట్టేసేందుకా లేక మా వివరాలు మొత్తం మీకెందుకంటూ ప్రశ్నిస్తున్నారు. ఏమి చేయాలో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు ఆధార్ ప్రామాణిత సర్వే విధానం పునఃపరిశీలించాల్సిన అవసరం ఉంది.

– మురళీనాథ్, సచివాలయ సంక్షేమ సంఘ రాష్ట్ర పాధ్యక్షుడు

అంతా గందరగోళం

'మామిడికి గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. కిలో తోతాపురి రకాన్ని రూ.12గా నిర్ణయించాం. ఈ ధరకు ఫ్యాక్టరీలు కొనాల్సిందే.

– మూడు రోజుల క్రితం కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

'మా కడుపు కొట్టడానికి ఫ్యాక్టరీ నిర్వాహకులంతా ఒక్కటయ్యారు. ప్రభుత్వం కిలో రూ.8 అమ్మాలని, మిగిలిన రూ.4 మా ఖాతాల్లో వేస్తామని చెప్పింది. కలెక్టర్ సైతం ఫ్యాక్టరీకు చెప్పేశాం.. మీరు వెళ్లి అమ్ముకోండి అంటున్నారు. కానీ కొనేవాడేడీ..? రూ.కిలోకు రూ.5 మించి ఇవ్వడం లేదు. గట్టిగా అడిగితే ఈ సారి మేము ఫ్యాక్టరీ తెరవం..మీకు ధర ఉన్నచోట అమ్ముకోండి అంటున్నారు పల్ప్ వాళ్లు.

- సగటు రైతు ఆవేదన

– తోతాపురిని రూ.5 మించి కొనలేం. తమిళనాడు నుంచి మాకు కిలో రూ.4కే వస్తోంది. గతేడాది తయారుచేసిన మామిడి గుజ్జు ఇంకా 80 వేల టన్నులు నిలిచిపోయింది. రూ.70కు విక్రయించాల్సిన పల్ప్‌ను రూ.32కు వదిలించుకున్నాం. నవంబర్ నుంచి మా గోడు వినమని ప్రభుత్వానికి చెబుతూనే ఉన్నాం. ఇపుడు రైతుల వద్ద మమ్మల్ని విలన్‌గా చూపించడం బాధేస్తోంది.

- ఫ్యాక్టరీ యజమానులు

- కలెక్టర్ చెప్పినా అమల్లోకిరాని గిట్టుబాటు ధర
- ఫ్యాక్టరీలు సిండికేటంటూ రైతుల కన్నీళ్లు
- పల్ప్ నిల్వలతో భారీగా నష్టపోయామంటున్న ఫ్యాక్టరీ యజమానులు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న యంత్రాంగం

చిత్తూరు అర్బన్: అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్నట్టు తయారైంది జిల్లాలో మామిడి రైతుల పరిస్థితి. కలెక్టర్ ఓ మాట, ఫ్యాక్టరీ యజమానులు మరో మాట.. రైతుల ఆవేదన ఇంకోలా ఉంది. మామిడికి కనీస ధరను నిర్ణయించి, దాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. అధికారుల సమీక్షలు, రైతులతో సమావేశాలు, ఫ్యాక్టరీల నిర్వాహకులతో వీడియో కాన్ఫరెన్సులు నిర్వహిస్తూ అరచేతిలో స్వర్గం అన్నట్లు అన్నదాతను మభ్యపెడుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర జిల్లాలో ఏ ఒక్క ఫ్యాక్టరీ నిర్వాహకుడూ ఆమోదించడం లేదు. కలెక్టర్ ఎదుట తలాడించిన పల్ప్ ఫ్యాక్టరీ నిర్వాహకులు.. బయటకొచ్చి తమ బాధలు లక్ష ఉన్నాయని, వాటిని ఎవరు పట్టించుకుంటారని నిలదీస్తున్నారు.

కష్టాలు తప్పవా?

జిల్లాలో దాదాపు 50 వేల హెక్టార్లలో మామిడి సాగవుతోంది. ఇందులో తోతాపురి (బెంగళూర) రకం 65 శాతం వరకు సాగవుతోంది. ఈ సీజన్‌కు 4లక్షల టన్నులకు పైగా తోతాపురి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. కానీ రైతులకు మాత్రం సగటున కిలోకు రూ.9 కంటే మించి గిట్టుబాటు ధర వచ్చే అవకాశాలు కనిపించడం లేదు. దీనికి ప్రధాన కారణం.. మామిడి పల్ప్ తయారీ ఫ్యాక్టరీ నిర్వాహకులతో కూటమి ప్రభుత్వం చర్చలు జరపకపోవడమే. పక్కనున్న తమిళనాడులో కిలో రూ.4 ఉంటే.. తమకు ఆర్డర్లు ఇచ్చే ఎగుమతి దారులు, తమిళనాడుకు వెళుతున్నారనే తప్ప, ఇక్కడి ధరలకు ఆర్డర్లు రావడం లేదని ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతున్నారు. అసలు ఇది వాస్తవమా..? కాదా..? అనే విషయాన్ని కలెక్టర్ నుంచి వ్యవసాయశాఖ అధికారుల వరకు ధృవీకరించి, క్షేత్రస్థాయిలో విచారించాల్సిన అవసరం ఉంది. కానీ ఏ ఒక్కరూ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో రైతులకు ఈ దఫా కన్నీళ్లే మిగలనున్నాయి.



చిత్తూరు మార్కెట్‌లో మామిడి కాయలు

భారీ నిల్వలు కారణమే!

ఉక్రెయిన్-రష్యా యుద్ధం కారణంగా జిల్లా నుంచి ఎగుమతి కావాల్సిన పల్ప్ భారీ మొత్తంలో స్తంభించిపోయింది. ఈ ఏడాది మార్చి వరకు 2.75 లక్షల టన్నుల పల్ప్ జిల్లాలోని ఫ్యాక్టరీల్లో నిలిచిపోయింది. పల్ప్ చెడిపోకుండా ఉండే కాలపరిమితి రెండేళ్లు. ఇప్పటికే ఓ ఏడాది అమ్ముడు కాలేదు. సరుకు చెడిపోవడానికి మరో ఏడాది కాలపరిమితే ఉండడంతో కిలో రూ.70 వరకు అమ్మాల్సిన పల్ప్‌ను, రూ.33కు విక్రయించినట్లు ఫ్యాక్టరీ నిర్వాహకులు చెబుతున్నారు. తమ వద్ద ఉన్న పల్ప్‌ను శ్రీవారి ఆలయంలో, కాణిపాకం, శ్రీశైలం లాంటి పుణ్యక్షేత్రాల్లో విక్రయించినట్లయితే గిట్టుబాటు ధర లభిస్తుందని చెబుతున్నారు. ఏడాదిగా ప్రభుత్వం పట్టించుకోకుండా, ఇపుడు రైతులకు గిట్టబాటు ధర పేరిట డ్రామాలు ఆడడం వల్ల.. ఒత్తిడితో ఫ్యాక్టరీలను మూసివేసే పరిస్థితి వస్తోందని నిర్వాహకులు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

తోతాపురి టన్ను రూ.12

చిత్తూరు కలెక్టరేట్ : తోతాపురి టన్ను రూ.12 వేలు నిర్ణయించామని, ఆ మేరకు పరిశ్రమల నిర్వాహకులు ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరను అమలు చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ గిట్టుబాటు ధర అమలులో తగు పర్యవేక్షణ అవసరమన్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి ప్రాసెసింగ్ కంపెనీలకు మామిడి సరఫరా కాకుండా చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా పెంచాలన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

పక్వానికి వచ్చిన కాయలనే కోయండి

జిల్లాలో మామిడి రైతులు పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోసి ప్రాసెసింగ్ కంపెనీలకు తరలించాలని కలెక్టర్ తెలిపారు.

రాత్రి పూట కౌన్సెలింగ్

- 273 మంది ఎస్జీటీ ఉద్యోగోన్నతులు
- రాత్రి 7 గంటలకు ప్రారంభమైన కౌన్సెలింగ్
- అవస్థల్లో ఉపాధ్యాయులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ పరిశీలన.. రాత్రి 7 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియ శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ పాఠశాలలో చేపట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన టీచర్లు పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడింది.

273 మందికి ఉద్యోగోన్నతులు

జిల్లాలోని ప్రభుత్వ, మున్సిపల్, జెడ్పీ, నగర పాలక యాజమాన్యాల్లో పనిచేస్తున్న టీచర్లకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియను డీఈఓ వరలక్ష్మి, ఏడీలు వెంకటేశ్వరరావు, సుకుమార్ పర్యవేక్షించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 273 స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు శుక్రవారం రాత్రి మొత్తం కౌన్సెలింగ్ నిర్వహించి ఉద్యోగోన్నతులు కల్పించే ప్రక్రియను చేపట్టారు.



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఇష్టానుసారంగా బదిలీ ఉత్తర్వులు

స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లకు శుక్రవారం బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీచర్లు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో బదిలీలకు దరఖాస్తులు చేసుకున్నారు. సంబంధిత సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న టీచర్లకు ప్రిఫరెన్షియల్ కేటగిరీలో మినహాయింపు కల్పించాలి. వారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న ప్రాంతాలకు బదిలీలు చేయాల్సి ఉంటుంది. అయితే చాలా మంది టీచర్లకు శ్రీకాళహస్తి నుంచి మదనపల్లికి, నాగలాపురం నుంచి పెద్దమండ్యం, శ్రీకాళహస్తి నుంచి చౌడేపల్లి ఇలా దూరప్రాంతాలకు బదిలీ చేశారు. ఈ విషయం పై బాధితులు చిత్తూరు జిల్లా విద్యాశాఖ అధికారుల వద్దకు వచ్చి సంప్రదిస్తుంటే తమకు ఎలాంటి సంబంధం లేదంటూ చేతులెత్తేశారు.

• ఒకే ఒక్కడు

రైతు'కు' భరోసా





గత ప్రభుత్వంలో అండగా నిలిచిన ఆర్బీకే

చిత్తూరు కలెక్టరేట్ : రైతన్నలకు తోడుగా ఉండేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాలు ఆరంభించింది. ఈ కేంద్రాలు గత ఐదేళ్ల పాటూ అన్నదాతకు తోడుగా నిలిచాయి. సాగుదారుల ప్రతి అవసరాన్నీ తీర్చాయి. పల్లెపట్టున విశేష సేవలందించాయి. తెల్లవారగానే మండల కేంద్రానికో.. జిల్లా కేంద్రానికో రైతులు పరుగులు తీయాల్సిన దుస్థితి తొలగిపోయింది. గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన అవస్థలు తప్పిపోయాయి. రవాణా ఖర్చుతో పాటు సమయం ఆదా అయ్యింది. సాగు ఉత్పాదకాల కోసమే కాకుండా సలహాలు, సూచనల కోసం రైతన్నలు ఆర్బీకేల తలుపు తట్టేవారు. అలాంటి ఆర్బీకే కేంద్రాలను నెలకొల్పిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సేవలను జిల్లా రైతులు గుర్తు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కూటమి పాలనలో రైతుభరోసా కేంద్రాలను నిర్వీర్యం చేసేలా కుట్రలు చేస్తున్నారని మండిపడుతున్నారు.

జిల్లాలో రైతుభరోసా కేంద్రాలు

నియోజకవర్గం	రైతుభరోసా కేంద్రాల సంఖ్య
చిత్తూరు	25
పలమనేరు	88
పూతలపట్టు	95
గంగాధరనెల్లూరు	86
కుప్పం	77
పుంగనూరు	99
నగరి	56
మొత్తం	526

క్లుప్తంగా

10 లీటర్ల శ్రీగంధం నూనె వృథా

- డీఆర్వో ఆనంద్‌రెడ్డి సస్పెన్షన్
- ఆదేశాలు జారీచేసిన సీఎఫ్ యశోదబాయి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు పశ్చిమ విభాగం డీఆర్వో (డిప్యూటీ రేంజ్ ఆఫీసర్) ఆనంద్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ సీఎఫ్(కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు) యశోదబాయి ఉత్తర్వులు జారీచేశారు. వివరాల్లోకి వెళితే.. పశ్చిమ రేంజ్ కార్యాలయంలో శ్రీగంధం డిపో(గోడౌన్) ఉంది. రాష్ట్రంలో ఎక్కడ కూడా శ్రీగంధం పట్టుబడినా ఇక్కడే నిల్వ ఉంచుతారు. విధి నిర్వహణలో భాగంగా వీటిని తరుచూ అధికారులు తనిఖీ చేస్తుంటారు. అందులో భాగంగా ఇటీవల డీఎఫ్‌ఓ భరణి తనిఖీ చేయనున్నట్టు సమాచారం ఇచ్చారు. ముందురోజు గోడౌన్ శుభ్రం చేయడానికి డీఆర్వో వెళ్లడంతో అక్కడ శ్రీగంధం నూనె క్యాన్లు పేలి వృథా అయినట్లు గుర్తించారు. వీటిపై రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. డీఎఫ్‌ఓ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్, సబ్‌డీఎఫ్‌ఓ వేణుగోపాల్‌ను విచారణ అధికారులుగా నియమించి పూర్తి సమాచారాన్ని రాబట్టారు. అనంతపురం జిల్లా పెనుగొండ ప్రాంతం నుంచి శ్రీగంధం నూనె ఇక్కడికి చేరిందని, క్యాన్ పేలడంతో వృథా అయినట్లు తేల్చారు. ఎందుకైనా మంచిదని నూనె శ్యాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు. వీటిపై డీఎఫ్‌ఓకు నివేదిక పెట్టగా ఆమె వాటిని కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టుకు రిపోర్టు చేశారు. గోడౌన్ ఇన్‌చార్జి అయిన డీఆర్వో విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉండడంతో శ్రీగంధం నూనె వృథా అయిందని గుర్తించి.. ఆయన్ను సస్పెండ్ చేస్తున్నట్లు ఆమె ఆదేశాలు జారీచేశారు.

సారా తయారీదారుపై 'పీడీ' యాక్ట్



నిందితుడు చంద్రశేఖర్

చిత్తూరు అర్బన్: నాటు సారా తయారు చేయడం, విక్రయించడమే వృత్తిగా ఎంచుకున్న బీ.చంద్రశేఖర్ (51)పై పీడీ యాక్టు ప్రయోగించారు. శుక్రవారం నిందితుడిని పీడీ యాక్టు కింద అరెస్టు చేసి కడప సెంట్రల్ జైలుకు తరలించారు. గుడిపాల మండలానికి చెందిన చంద్రశేఖర్‌పై గత మూడేళ్లలో నాటుసారా తయారీ, విక్రయాలు చేస్తుండగా ఐదుమార్లు కేసులు నమోదు చేసిన జైలుకు తరలించారు. 2022 లో కూడా నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఇతని ప్రవృత్తిలో ఎలాంటి మార్పు లేకపోవడంతో ఎక్సైజ్ ఈఎస్ శ్రీనివాస్, కలెక్టర్‌కు నివేదిక పంపారు. కలెక్టర్ దీనిపై ఉత్తర్వులు జారీ చేయడంతో చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ సీఐ శ్రీహరిరెడ్డి ఆదేశాల మేరకు నిందితుడిని అరెస్టు చేసి.. కడప జైలుకు తరలించారు.

క్వారీ.. ఆక్రమణల సవారీ!

- మాదిగబండ క్వారీని ఆక్రమించిన టీడీపీ నేత!
- హైకోర్టులో కేసు నడుస్తున్నా బేఖాతర్
- లీజుదారుని కాదని తానే పనులు చేపడుతున్న వైనం
- విచ్చలవిడిగా సాగుతున్న బ్లాస్టింగ్‌లు, జల్లి అమ్మకాలు
- పట్టించుకోని మైనింగ్ అధికారులు

పలమనేరు: అధికారంలో ఉంటే చాలు చట్టాలు, కోర్టులను పట్టించుకోకుండా అక్రమాలకు దిగడం కూటమి నేతలకు కొత్తేమీ కాదు. మొన్నటి దాకా మిన్నకుండి కర్ణాటకలో బీజేపీ నేతగా, ఇక్కడ టీడీపీ నేతగా చెలామని అవుతున్న ఓ నేత కూటమి అధికార బలం, మైనింగ్ అధికారుల అండతో అక్రమంగా క్వారీని స్వాధీనం చేసుకుని యథేచ్ఛగా స్టోన్ క్రషింగ్ పనులు చేపడుతున్నాడు. అసలైన లీజుదారులు హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేసి కేసు పెండింగ్‌లో ఉండగా క్వారీని ఆక్రమించుకొని పనులు చేసుకుంటున్న వ్యవహారం పలమనేరు మండలం, కొలమాసనపల్లి పంచాయతీ, మాదిగబండ వద్ద శుక్రవారం వెలుగు చూసింది. అసలైన లీజుదారుడు శరత్‌కుమార్ కథనం మేరకు..

మాదిగబండ క్వారీలో సర్వే నం.1375/3, 1376/4లో 1.170 హెక్టార్లలో రోడ్‌మెటల్, బిల్డింగ్ స్టోన్ లీజుదారుగా 2021 నుంచి జీ.మోహన్‌బాబు క్వారీ లీజుదారుగా ఉండేవారు. దీన్ని ఆయన వీ.కోట మండలం, కుంబార్లపల్లికి చెందిన శరత్‌కుమార్‌కు 22–10–2021న బదిలీ చేశారు. ఇందుకు సంబంధించి స్థానిక మైనింగ్ శాఖలో అప్పటి ఏడీ వేణుగోపాల్ ప్రొసీడింగ్స్ నం.1059/టీక్యూఎల్/ఆర్ఎంబీఎస్/21 గా ఇచ్చారు. శరత్‌కుమార్ క్వారీకి సంబంధించి హెచ్‌టీ సర్వీస్ నం.2503 పేరిట తీసుకున్నాడు. ఇలా ఉండగా ఇదే క్వారీ ఇన్ ఎలిజిబుల్ జాబితాలో ఉందంటూ 2024 నవంబర్ 8న అప్పటి పలమనేరు మైనింగ్ ఏడీ లీజుదారుడైన శరత్‌కుమార్‌కు ప్రొసీడింగ్స్ నం.1059 మేర షోకాజ్ నోటీసు జారీచేసింది. దీంతో లీజుదారుడు పనులు ఆపేశాడు. అంతకుముందే 2024 జూన్ 6న స్థానిక ట్రాన్స్‌కో అధికారులకు అప్పటిదాకా ఉన్న బకాయిలను చెల్లించి సర్వీసును డీసీ చేయమని ట్రాన్స్‌కో ఎస్‌ఈ(ఆపరేషన్)కు అర్జీ ఇచ్చాడు. ఈ విషయాన్ని స్థానిక మైనింగ్ అధికారులకు తెలిపారు.

కూటమి అధికారంలోకి రాగానే..

ఇదిలావుండగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కర్ణాటక, ఏపీ పాలిటిక్స్‌లో డబుల్‌రోల్ పోషిస్తున్న జనార్దన్‌నాయుడు అనే వ్యక్తి అక్రమంగా తన రౌడీలతో వచ్చి మాదిగబండ క్వారీని స్వాధీనం చేసుకున్నాడు. అక్కడున్న జల్లిని సైతం కర్ణాటకకు తరలించుకుపోయాడు. దీనిపై లీజుదారుడైన శరత్‌కుమార్ అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినా పట్టించు కోలేదు. కలెక్టర్ ఆదేశాలతో అప్పటి తహసీల్దార్ క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ఆ క్వారీకి లీజుదారుడు శరత్‌కుమారేనని, జనార్ధన్ నాయుడు ఆక్రమించుకొంది నిజమేనని నివేదిక పంపారు. కానీ బాధితునికి న్యాయం జరగ లేదు.



మాదిగబండ వద్ద జనార్దన్ నాయుడు స్వాధీనం చేసుకుని పనులు చేస్తున్న క్వారీ ఇదే



IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT AMARAVATI

W.P. No. [illegible] OF 2024

Between

G Sarath Kumar, S/o G Amara Narayana, Hindu aged about 41 years Occ: Business R/o D No 8/281 [illegible] Chittoor District ...Petitioner

And

The State of Andhra Pradesh, Rep by its Principal Secretary Mines and Geology Secretariat Building Velagapudi and others ...Respondents

COUNTER AFFIDAVIT FILED BY THE RESPONDENT NO.6

I, Thota Balasubramanyam, S/o Late Sri T Ramaiah, aged about 50 years, working as the Divisional Mines and Geology Officer, Palamaner Chittoor District, do hereby solemnly and sincerely affirm and state as follows:

1. I submit that I am the 6th Respondent and as such, I am well acquainted with the facts of the case. I have gone through the affidavit filed by the petitioner and its does not disclose any valid grounds to invoke the jurisdiction of this Hon'ble Court under Article 226 of the Constitution of India. I am denying all the allegations made in the affidavit except those that are

హైకోర్టులో నడుస్తున్న కేసు (ఫైల్)

ఇదే అదునుగా సదరు నేత క్వారీని ఆక్రమించుకుని యథేచ్ఛగా స్టోన్ క్రషింగ్ పనులు చేపట్టాడు. దీంతో బాధితుడు శరత్‌కుమార్ హైకోర్టులో గత ఏడాది సెప్టెంబర్ 3న రిట్‌పిటిషన్ ఫైల్ చేశారు. ప్రస్తుతం ఈ కేసు హైకోర్టులో నడుస్తోంది.

అధికార బలంతో మళ్లీ పనులు

మొన్నటిదాకా స్తబ్ధంగా ఉన్న ఆక్రమణదారుడు తనకున్న పలుకుబడితో ఆక్రమించుకున్న క్వారీలో పనులు మొదలు పెట్టాడు. ప్రస్తుతం కొందరు రౌడీలను అక్కడ ఉంచుకొని తమిళనాడు కూలీల ద్వారా బ్లాస్టింగ్ చేసి రోజుకు 500 టన్నుల దాకా గ్రావెల్‌ను విక్రయిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం అక్కడ హిటాచీలు, టిప్పర్లు దర్శనమిస్తున్నాయి. లీజుదారుగా ఉన్న శరత్‌కుమార్‌కున్న లీజు గడువు ముగియడంతో తాము రెన్యూవల్ కోసం షోకాజ్ నోటీసులను పంపామని ఆయన రెస్పాండ్ కాలేదని, అక్కడ ఇతర వ్యక్తుల ఆక్రమణలు లేవని గతంలో ఉన్న పలమనేరు మైనింగ్‌ఏడీ బాలసుబ్రమణ్యం హైకోర్టుకు తన కౌంటర్‌లో తెలిపారు.

క్వారీని పరిశీలించి చర్యలు తీసుకుంటాం



మాదిగబండ క్వారీలో అక్రమంగా పనులు జరుగుతున్న విషయం నా దృష్టికి రాలేదు. ఈ క్వారీకి సంబంధించిన కేసు హైకోర్టులో ఉందనే విషయం తెలియదు. సంబంధిత క్వారీ ఫైల్ చూసి సోమవారం నేనే స్వయంగా వెళ్లి అక్కడి క్వారీని పరిశీలిస్తా. అనుమతులు లేకుండా, లీజుదారుగాని వ్యక్తులు అక్కడ పనులు చేస్తుంటే చర్యలు తప్పవు.

– సత్యనారాయణ, మైనింగ్ ఏడీ, పలమనేరు

డీమ్డ్ యూనివర్సిటీగా ఆదిశంకర

- వెల్లడించిన అధినేత



మాట్లాడుతున్న ఆదిశంకర అధినేత వంకి పెంచలయ్య

నెల్లూరు (టౌన్): ఆదిశంకర గ్రూపు ఆఫ్ ఇన్‌స్టిట్యూట్‌కు డీమ్డ్ యూనివర్సిటీగా కేంద్ర ప్రభుత్వం నుంచి గుర్తింపు లభించిందని ఆ విద్యాసంస్థల గ్రూపు చైర్మన్ వంకి పెంచలయ్య తెలిపారు. నెల్లూరు దర్గామిట్టలోని మినర్వా గ్రాండ్‌లో డీమ్డ్ యూనివర్సిటీ లోగోను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ జోన్‌లో డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపు పొందింది కేవలం ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల మాత్రమేనని చెప్పారు. 2001లో కేవలం 180 మంది విద్యార్థులతో ప్రారంభమైన ఇంజినీరింగ్ కళాశాల నేడు 8వేల మంది విద్యార్థులతో ఉందన్నారు. కోవూరు సమీపంలోని రామన్నపాలెం వద్ద కొత్తగా ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాలను 2025–26 విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ బిందు మధ్వాచార్య, ప్రొఫెసర్లు వేణుమాధవ్, ధనుంజయ, ఏఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కన్నమేసి.. కాజేశాడా?

- చిత్తూరులో బంగారు నగల చోరీ ఘటనలో పురోగతి
- సరిహద్దు ప్రాంతానికి చెందిన నిందితుడి పనేని నిర్ధారణ

చిత్తూరు అర్బన్: ఎంత పెద్ద భవనమైనా.. దాని టాప్‌లో కన్నం వేసి చోరీ చేయడంలో దిట్ట. తమిళనాడు–కర్ణాటక సరిహద్దు ప్రాంతానికి చెందిన నిందితుడే.. చిత్తూరులోని బంగారు ఆభరణాల దుకాణంలో చోరీకి పాల్పడ్డట్లు పోలీసులకు క్లూ లభించింది. బుధవారం అర్ధరాత్రి చిత్తూరులోని ఓ బంగారు దుకాణం, మరో స్టీల్ సామాన్ల విక్రయించే దుకాణంలోకి చొరబడ్డ గుర్తుతెలియని వ్యక్తి .. 180 గ్రాముల బంగారు ఆభరణాలు, అయిదున్నర కిలోల వెండి వస్తువులు, రూ.3 లక్షలకు పైగా నగదు చోరీ చేశాడు. కేసును విచారిస్తున్న పోలీసులు.. చోరీకి పాల్పడింది ఒకే ఒక్కడని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. నిందితుడిపై గతంలో పలు స్టేషన్లలో పదికి పైగా చోరీ కేసులు కూడా ఉన్నట్లు తెలుసుకున్నారు. అయితే నిందితుడి వివరాలు వెల్లడిస్తే, అతను పారిపోయే ప్రమాదం ఉండడంతో ఆ వివరాలను దాచి ఉంచారు. ఇప్పటికే నిందితుడిని పట్టుకోవడానికి మూడు బృందాలు గాలిస్తున్నాయి.



చోరీ జరిగిన దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ, పోలీసు అధికారులు (ఫైల్)

ఆనాటి.. ఆ స్నేహమానందగీతం!



వివాహ వేడుకలో చిన్ననాటి స్నేహితులతో మాజీ మంత్రి ఆర్కే రోజా

- వివాహ వేడుకల్లో చిన్ననాటి స్నేహితుల అపూర్వ కలయిక
- తలుపు తట్టిన మధురజ్ఞాపకాలు
- భావోద్వేగానికి గురైన మాజీ మంత్రి ఆర్కే రోజా

నగరి : చిన్ననాటి స్నేహితులందరూ తమ స్నేహితురాలి కుమారుని పెళ్లిలో కలుసుకున్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజా స్నేహితురాలు శంకరమ్మ కుమారుడు చంద్రారెడ్డి, మోక్షితకు శుక్రవారం ఉదయం అన్నమయ్య జిల్లా పీలేరులోని ఎస్‌పీఎస్‌ఎస్ కల్యాణ మండపంలో వివాహమైంది. గురువారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా, భాకరాపేట పాఠశాలలో 10వ తరగతి వరకు కలిసి చదువుకున్న వారంతా ఆ వివాహ వేడుకలకు హాజరయ్యారు. వీరిలో కొందరు ఉద్యోగాల్లో స్థిరపడగా, మరికొంత మంది వ్యాపారం, ఇతర రంగాల్లో కొనసాగుతున్నారు. వారిలో ఒకరైన రోజా సినీ రంగంలోను, రాజకీయ రంగంలోనూ రాణిస్తున్నారు. ఎవరు ఎంత ఎత్తుకు ఎదిగినా స్నేహమాధుర్యం మళ్లీ వారిని బడి ఈడు పిల్లలుగా మార్చేసింది. ఆ నాటి స్నేహం ఆనంద గీతమై ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. బాధలు తెలియని నవ్వులు, మౌనం తెలియని మాటలు, కల్మషమెరుగని ప్రేమలు, కష్టం ఎరుగని క్షణాలతో గడిపిన రోజులను తలచుకొని చిన్న పిల్లలైపోయారు. చదువులమ్మ బడిలో చేసిన అల్లరిని జ్ఞప్తికి తెచ్చుకున్నారు. మనసులో మరపురాని బాల్యపు పుటలను తిరగవేశారు. అందులో నిండిన ఆనంద క్షణాలను ఆస్వాదించారు. బడిస్నేహం వారిని కొత్త బంగారు లోకానికి తీసుకెళ్లింది. చిన్ననాటి కథలు మధుర జ్ఞాపకాల తలుపులను తెరిచాయి. ఇకపై అందరూ టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు మళ్లీ కలుసుకున్న తీపి క్షణాలను ఎప్పటికీ గుర్తుంచుకోవాలని ఫొటోలు తీసుకుని భద్రపరుచుకున్నారు. స్నేహితులకు తమ పిల్లలను, కుటుంబ సభ్యులను పరిచయం చేసుకున్నారు. చిన్ననాటి స్నేహితులను కలిసి ఆనందాలు పంచుకోవడం మరువలేని క్షణాలని, తాను ఎంతో భావోద్వేగానికి గురయ్యానని ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆర్కే రోజా తెలిపారు.

ఉజ్వల భవితకు ఐఐటీ


- నేడు తిరుపతి ఐఐటీలో ఓపెన్ హౌస్ సెషన్

ఏర్పేడు : జేఈఈ అడ్వాన్స్‌డ్–2025 అర్హత సాధించిన అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులకు తిరుపతి ఐఐటీ శనివారం ఓపెన్‌హౌస్ పేరిట ఆహ్వానించినట్లు ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఏర్పేడు సమీపంలో ఉన్న తిరుపతి ఐఐటీలో చేపడుతున్న విద్యా కార్యక్రమాలు, క్యాంపస్‌లో ఉన్న అధునాతన సౌకర్యాలు, అందుబాటులో ఉన్న కోర్సులు, అండర్ గ్రాడ్యుయేట్ కరికులం, డ్యూయల్ డిగ్రీ వెసులుబాటు, హాస్టల్ సదుపాయాలు, ఆరోగ్య పరిరక్షణ సౌకర్యాలు, విద్యార్థులు తమ మేధస్సుతో నూతన ఆవిష్కరణ వైపు తీర్చిదిద్దేందుకు ఐఐటీలో ఉన్న అవకాశాలను గురించి ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. అలాగే కార్యక్రమ అనంతరం విద్యార్థులు, వారి దల్లిదండ్రులతో క్యాంపస్ టూర్ ఏర్పాటు చేసి ఐఐటీలో ఉన్న అధునాతన సౌకర్యాలు, బోధనాభ్యసన విధానాలపై ప్రత్యక్ష అనుభవం కల్పించనున్నట్లు ఆయన వివరించారు. ఈ సెషన్‌కు విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి స్వయంగా పాల్గొనవచ్చని, ఇక్కడకు వచ్చేందుకు వీలు కాని వారు ఆన్‌లైన్‌లోనూ హాజరు కావచ్చన్నారు. తిరుపతి ఐఐటీ అధికారిక వెబ్‌సైట్‌లో వివరాలు పొందుపరిచి ఉన్నట్లు , ఆసక్తి ఉన్న విద్యార్థులు తమ వివరాలను నమోదు చేసుకుని ఓపెన్‌హౌస్ సెషన్‌లో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

ఆరు టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

యాదమరి: అక్రమంగా తరలిస్తున్న 6 టన్నుల రేషన్ బియ్యం, ఒక బొలెరో వాహనం, టాటా వాహనం, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం మండల పరిధిలోని ఒరిగపల్లి సమీపంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో దాడులు చేసినట్లు వెల్లడించారు. పలమనేరు, బైరెడ్డిపల్లి, బంగారుపాళెం మండలాలకు చెందిన సద్దాం హుస్సేన్, బలరాంరెడ్డి, దేవేంద్రారెడ్డి, మోతీష్ అనే నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.78 వేలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సోషల్ వెల్ఫేర్ డీడీగా విక్రమ్‌కుమార్‌రెడ్డి



బాధ్యతలు స్వీకరిస్తున్న విక్రమ్‌కుమార్‌రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీగా విక్రమ్‌కుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీగా పనిచేస్తున్న చెన్నయ్యను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. తిరుపతి జిల్లా డీఎస్‌డబ్ల్యూఓగా పనిచేస్తున్న విక్రమ్‌కుమార్‌రెడ్డిని చిత్తూరు జిల్లా సోషల్ వెల్ఫేర్ డీడీగా అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ట్యాంకర్ పై నుంచి పడి వ్యక్తి మృతి

యాదమరి: ఓ ప్రైవేటు డెయిరీలో పనిచేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు ట్యాంకర్ పై నుంచి పడి మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానిక ఎస్ఐ ఈశ్వర్ కథనం.. మండలంలోని కీనాటంపల్లి గ్రామానికి చెందిన పెమ్మిరెడ్డి కుమారుడు జి.రాజశేఖర్ రెడ్డి(58) మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాల డెయిరీలో చిరుద్యోగి. శుక్రవారం విధి నిర్వహణలో భాగంగా ఒక స్టేషనరీ పాల ట్యాంకర్ పై సీల్ వేస్తుండగా కాలు జారి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే రాజశేఖర్‌రెడ్డి మృతిచెందినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. కుటుంబ పెద్ద దిక్కు కోల్పోవడంతో బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తవణంపల్లె: మండలంలోని ఉత్తరబ్రాహ్మణపల్లె వడ్డిపల్లె మలుపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తవణంపల్లె ఎస్ఐ చిరంజీవి తెలిపారు. శుక్రవారం రాత్రి ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలసి దాడి చేసినట్లు వివరించారు. యాటీపల్లె వడ్డిపల్లెకు చెందిన శరవణ కుమారుడు జి.దిలీప్(21) మద్యం విక్రయిస్తూ పట్టుబడినట్టు వెల్లడించారు. దిలీప్ దగ్గర ఉన్న 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

లాసెట్ ప్రవేశాల కీ విడుదల

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన 3, 5 ఏళ్ల లా కోర్సు, పీజీ లా కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్–2025 పరీక్షకు సంబంధించి ప్రాథమిక కీని శుక్రవారం విడుదల చేశారు. అభ్యర్థులు ప్రాథమిక కీ కోసం ఉన్నత విద్యామండి వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. జవాబు కీపై 8వతేదీలోపు అభ్యంతరాలను తెలిపేందుకు అవకాశం ఇచ్చారు. అభ్యంతరాల సమీక్ష అనంతరం 16న ఫైనల్ కీ విడుదల చేసి 22వ తేదీన ఫలితాలను ప్రకటించనున్నారు.

25 నుంచి డిగ్రీ ఇన్‌స్టెంట్ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో 2022–23 బ్యాచ్ డిగ్రీ 5వ సెమిస్టర్ రెగ్యులర్‌గా చదవి పరీక్షలలో తప్పిన విద్యార్థులకు ఈనెల 25వ తేదీ నుంచి ఇన్‌స్టెంట్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజమాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈనెల 16వ తేదీలోపు పరీక్ష ఫీజును చెల్లించాలన్నారు. రూ.1500 అపరాధ రుసుముతో 18 వరకు, రూ.3500 అపరాధ రుసుముతో ఈనెల 20వ తేదీలోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

యూపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- రేపు ఇంజినీరింగ్ సర్వీసెస్ పరీక్ష

తిరుపతి అర్బన్ : యూపీఎస్సీకి చెందిన ఇ–ఇంజినీరింగ్ సర్వీసెస్ (ప్రిలిమినరీ)పరీక్షకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన పరీక్షల నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలో రెండు పరీక్షా కేంద్రాల్లో 791 మంది అభ్యర్థులు హజరు కానున్నారని వెల్లడించారు. పేపర్–1 పరీక్ష ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, పేపర్–2 పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందని స్పష్టం చేశారు. పరీక్షకు అభ్యర్థులు గుర్తింపుకార్డు తెచ్చుకోవాలని సూచించారు. తిరుపతిలోని రెండు పరీక్షా కేంద్రాలైన తిరుచానూరు రోడ్డు లక్ష్మీపురం సర్కిల్ సమీపంలోని ఎస్‌డీఎస్ ఆర్ట్స్ కళాశాల, బాలాజీ కాలనీ, వెస్ట్ చర్చిరోడ్డు మార్గంలోని శ్రీ పద్మావతి బాలికల ఉన్నత పాఠశాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

నిద్రపుచ్చి.. కౌన్సెలింగ్ కొచ్చి!



కౌన్సెలింగ్‌కొచ్చిన కుప్పం మండలం నడిమూరు హైస్కూల్ పీఈటీ

గది నిండా గజిబిజీ. కౌన్సెలింగ్ ప్రక్రియలో అందరూ బీజీబిజీ. కానీ ఓ చంటి పిల్లాడు అవన్నీ పట్టించుకోలేదు. కౌన్సెలింగ్ గదిలోనే బల్లపై పడుకుని హాయిగా నిద్రపోతూ.. భవిష్యత్‌లో తనకూ ఇలాంటి రోజులొస్తాయే మోనని కలలు గంటున్నట్టు.. అప్పుడప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ అందర్నీ ఆకట్టుకున్నాడు. ఈ ఘటన ఎక్కడో కాదండోయ్.. చిత్తూరు జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయానికి పక్కనే ఉన్న ప్రభుత్వ పాఠశాలలో. ఎస్జీటీ కేడర్ నుంచి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎస్జీటీ టీచర్లు హాజరయ్యారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియలో పాల్గొన్నారు. ఇందులో పలువురు చంటి పిల్లల తల్లులు విచ్చేశారు. తల్లులు ఒక వైపు కౌన్సెలింగ్ టెన్షన్‌తో ఉండగా.. వారికి తోడుగా వచ్చిన బంధువులు పిల్లలను ఆడిస్తూ.. పాడిస్తూ.. నిద్రపుచ్చుతూ కనిపించారు.

– చిత్తూరు కలెక్టరేట్



కౌన్సెలింగ్ హాల్లో బల్లపై పడుకుని హాయిగా కునుకు తీస్తున్న చిన్నారి